జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | 4 | అక్టోబర్ | 2025 ◆ పేజీలు : 6

## భద్రాద్రి జిల్లాకు కేంద్రీయ విద్యాలయం మంజూరు

■ ఫలించిన ఎంపీ రఘురాంరెడ్డి కృషి



**కొత్తగూడెం, అక్టోబర్ 3 (ప్రజాజ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు ఆవశ్యకత ఎంతో ఉందని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి పార్లమెంట్ లో చర్చించి, మంజూరు చేయాల్సిందిగా గతంలో కేంద్ర ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేయడంతో తాజాగా కేంద్రం స్పందించి మంజూరు చేసింది. కొత్తగా తెలంగాణ రాష్ట్రానికి నాలుగు కేటాయించగా అందులో ఒకటి భద్రాద్రి జిల్లాకు దక్కింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలప్పుడు ఆదివాసీ బిడ్డల విద్యాభివృద్ధి కోసం కేంద్రం చొరవ చూపాల్సిన అవసరం ఉందని ఈ మేరకు ముందుకు రావాలని కోరగా చేసిన అభ్యర్థనలు ఫలించాయి. ఎంపీ రఘురాంరెడ్డి చూపిన చొరవ, ప్రత్యేక శ్రద్ధతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కేంద్రీయ విద్యాలయం మంజూరవడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆదివాసీ నేతలు పలువురు హర్షం వ్యక్తం చేశారు.



- ప్రజలందరూ సంతోషంగా ఉండాలి
- అమ్మ వారి దీవెనలు అందరిపై ఉండాలి: మంత్రి పొంగులేటి

## దసరా ఉత్సవాలకు బ్రాండ్ గా ఇల్లందు

**ఇల్లందు, అక్టోబర్ 3, ప్రజాజ్యోతి:** గతకొన్నిఏళ్లుగా దసరా ఉత్సవాలకు బ్రాండ్ గా, మినీ మైసూర్ గా ఇల్లందు కొనసాగుతూ వస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం జెకె కాలనీ లోని బ్లాక్ డైమండ్ స్టేడియంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దసరా పండుగతో పాటు ప్రజలందరూ ఎల్లవేళలా సుఖ సంతోషాలతో ఉండాలని, అమ్మవారి దీవెన ప్రతి ఒక్కరిపై ఉండాలని కోరారు. రాష్ట్రంలో ప్రజల ఆశీర్వాదాలతో కొలువుతీరిన ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రజలు ఏది కోరుకుంటే, వారి ఇష్ట ప్రకారమే పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ ఉత్సవాలలో ప్రజలు నవరాత్రుల్లో నిష్ఠతో చేసిన పూజలతో వారి కోరికలను అమ్మవారు నెరవేర్చాలని వేడుకుంటున్నామని తెలిపారు. ప్రజలందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం తరపున విజయదశమి శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం రావణ వధ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చింత శ్రీకాంత్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్లు మడత రమ వెంకట్ గౌడ్, యదళ్లపల్లి అనసూయ, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మాజీ వైస్ చైర్మన్ లు మడత వెంకట్ గౌడ్, సయ్యద్ జానీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు దొడ్డ డానియల్, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, జాఫర్, పడిదల నవీన్, పులి సైదులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## స్థానిక సంస్థల ఎన్నికల్లో బి ఆర్ఎస్ గెలుపు ఖాయం

### - రేగా కాంతారావు


- డబ్బు కాంగ్రెస్ దగ్గర... ప్రజలు బిఆర్ఎస్ వెంట -మెచ్చా
- దమ్మపేటలో బిఆర్ఎస్ శక్తి ప్రదర్శన


**దమ్మపేట, అక్టోబర్ 3 (ప్రజాజ్యోతి):** స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో దమ్మపేట మండలం, పార్కలగండిలో మండల పార్టీ అధ్యక్షులు దొడ్డా రమేష్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ మండల స్థాయి నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు రేగ కాంతారావు, అశ్వారావుపేట నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రేగ కాంతారావు మాట్లాడుతూ,
“కాంగ్రెస్ దగ్గర డబ్బుంటే, బిఆర్ఎస్ వెంట ప్రజలున్నారు. రాష్ట్ర ప్రజల సొమ్మును వేరే రాష్ట్రాలకు పంచుతూ కాంగ్రెస్ ద్రోహ పాలన కొనసాగిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు

మిగతా 2 లో...

## గంగలూర్ లో ఎన్ కౌంటర్

- ఒక మావోయిస్టు మృతి
- మృతి చెందిన మావోయిస్టు పై 5లక్షల రివార్డ్
- ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం



2 లో...

## 103 మంది మావోయిస్టులు లొంగుబాటు

- లొంగిపోయిన మావోయిస్టులపై ఒక కోటి అరవై లక్షల రివార్డ్
- లొంగిపోయిన మావోయిస్టులకు 50 వేల నగదు అందజేత

**చర్ల, అక్టోబర్ 3 (ప్రజాజ్యోతి ):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ లో నక్సల్ ప్రభావిత బీజాపూర్ జిల్లాలో గురువారం 103 మంది మావోయిస్టులు తమ ఆయుధాలను అప్పగించి జన జీవన స్రవంతిలోకి తిరిగి రావాలని నిర్ణయించుకున్నారు. వీరిలో 49 మంది మావోయిస్టులు కూడా ఉన్నారు, వారి తలలపై మొత్తం ఒక కోటి అరవై లక్షల ముప్పై వేల రివార్డ్ బహుమతి ప్రకటించారు. లొంగిపోయిన వారిలో ఒక డి వి సి ఏం, నలుగురు పీ పీ సి ఏం లు, నలుగురు ఏ సి ఏం లు, ఐదుగురు ఏరియా కమిటీ సభ్యులు, ఐదుగురు మిలీషియా కమాండర్లు /డిప్యూటీ కమాండర్లు, నలుగురు జనతా సర్కార్ అధ్యక్షులు, 22 మంది జనతా సర్కార్ సభ్యులు, 23 మంది మిలీషియా ప్లాటూన్ సభ్యులు వంటి వివిధ హోదాల్లో క్రియాశీలకంగా పనిచేస్తున్న మావోయిస్టులు ఉన్నారు. సంస్థ యొక్క భావజాలం, నిరంతర నాయకత్వ కొరత, భద్రతా దళాల చర్యలు ప్రభుత్వ పునరావాస విధానం తమను ఈ చర్య తీసుకోవడానికి ప్రేరేపించాయని లొంగిపోయిన

మిగతా 2 లో...



# 103 మంది మావోయిస్టులు లొంగుబాటు



(మొదటి పేజీ తరువాయి...)

నక్సలైట్లు పేర్కొన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రోత్సాహకంగా ఒక్కొక్కరికి 50,000 రూపాయల చెక్కులు ఇచ్చారు. బీజాపూర్ లో జరిగిన ఈ కార్యక్రమంలో దంతేవాడ రేంజ్ డిప్యూటీ ఇన్ స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, కమ్లోచన్ కశ్యప్, సీఆర్ పీఎఫ్ సెక్టార్ డీఐజీ బీఎస్ నేగి, బీజాపూర్ ఎస్పీ డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్, కోబ్రా , సీఆర్ పీఎఫ్ బెటాలియన్ల కమాండెంట్లు, ఎస్ టీఎఫ్ మరియు డీఆర్ జీ సీనియర్ అధికారులు ఇతర పోలీసు అధికారుల పాల్గొన్నారు. గణాంకాల ప్రకారం జనవరి 1, 2025 నుండి, 421 మంది మావోయిస్టులు అరెస్టు చేయబడ్డారు, 410 మంది లొంగిపోయారు . 137 మంది మరణించారు. అదే సమయంలో, జనవరి 1, 2024 నుండి, 924 మంది అరెస్టు చేయబడ్డారు, 599 మంది లొంగిపోయారు 195 మంది మావోయిస్టులు ఎన్ కౌంటర్లలో మరణించారు. భద్రతా శిబిరాలు అభివృద్ధి పథకాల ప్రభావంతో గ్రామీణ ప్రాంతాల్లో కొత్త భద్రతా శిబిరాలను ఏర్పాటు చేయడం రోడ్లు, విద్యుత్, నీరు , విద్య వంటి సౌకర్యాల విస్తరణ వలన లొంగుబాటు పునరావాస విధానాన్ని ప్రోత్సహించడం తో మావోయిస్టులు సంస్థను వదిలిపెట్టి జన జీవన స్రవంతిలోకి రావాలని లొంగిపోతున్నారు అని అధికారులు తెలియచేస్తున్నారు .

# గంగలూర్ లో ఎన్ కౌంటర్

- ఒక మావోయిస్టు మృతి
- మృతి చెందిన మావోయిస్టు పై 5లక్షల రివార్డ్
- ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం

**చర్ల, అక్టోబర్ 3 (ప్రజాజ్యోతి ):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ బీజాపూర్ జిల్లాలోని గంగలూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గురువారం గంపూర్ పురంగెల్ అడవుల్లో జరిగిన ఎన్ కౌంటర్ లో రూ. 5 లక్షల రివార్డుతో ఉన్న ఒక నక్సలైట్ మృతి చెందాడు. నక్సలైట్ల ఉనికిపై సమాచారం ఆధారంగా, భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి ఈ ఎన్ కౌంటర్ జరిగింది. ఎన్ కౌంటర్ స్థలం నుండి ఒక బిజిఎల్ లాంచర్, సింగిల్ షాట్ గన్, పేలుడు పదార్థం మరియు ఇతర నక్సల్ సంబంధిత వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నారు.గంగలూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గంపూర్-పురంగెల్ ప్రాంతంలో నక్సలైట్ క్యాడర్ల కార్యకలాపాల గురించి విశ్వసనీయ సమాచారం ఆధారంగా, డిఆర్ జి బిజాపూర్ , ఎస్ టిఎఫ్ బృందం సెర్చ్ ఆపరేషన్ నిర్వహించిందని బీజాపూర్ పోలీస్ సూపరింటెండెంట్ డాక్టర్ జితేంద్ర యాదవ్ తెలిపారు. ఈ ఆపరేషన్ సమయంలో అడవుల్లో పోలీసు బలగాలు నక్సలైట్ల మధ్య అడపాదడపా ఎదురుకాల్పులు జరిగాయి. ఎదురుకాల్పులు తర్వాత ఎన్ కౌంటర్ స్థలంలో సెర్చ్ చేయగా ఒక నక్సలైట్ మృతదేహం, బిజిఎల్ లాంచర్, సింగిల్ షాట్ గన్, పేలుడు పదార్థాలు నక్సలైట్ సంబంధిత వస్తువులు లభించాయి. మరణించిన నక్సలైట్ ను మొదట బీజాపూర్ జిల్లా గంగలూర్ పోలీస్ స్టేషన్ లోని గంపూర్ నివాసి అయిన ఐతు పోడియం (35) గా గుర్తించారు. ఈ నక్సలైట్ గంగలూర్ ఏరియా కమిటీకి ఎసిఎం, అతనిపై ₹5 లక్షల రివార్డు ప్రకటించారు. ఎన్ కౌంటర్ స్థలం నుండి ఒక బిజిఎల్ లాంచర్, 3 సెల్స్, ఒక సింగిల్ షాట్, 3 రౌండ్లు, ఒక వాకీ-టాకీ, ఒక టిఫిన్ బాంబు, కార్డెక్స్ వైర్, ఒక సేఫ్టీ ఫ్యూజ్, మావోయిస్టు యూనిఫాంలు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. బస్తర్ ప్రాంతంలో మోహరించిన పోలీసులు మరియు భద్రతా దళాలు ఈ ప్రాంత పౌరుల భద్రతను నిర్ధారించడానికి పూర్తిగా కట్టుబడి ఉన్నాయని బస్తర్ రేంజ్ ఇన్ స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్ రాజ్ పి. పేర్కొన్నారు. మావోయిస్టు కార్యకర్తలు హింసను విడిచి పెట్టి, అమాయక పౌరులను వారి ఆస్తులను లక్ష్యంగా చేసుకోవడం ఆపాలని ఐజిపి విజ్ఞప్తి చేశారు. మావోయిస్టులు ప్రభుత్వ పునరావాస విధానాన్ని సద్వినియోగం చేసుకుని జన జీవన స్రవంతిలో చేరి గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని అధికారులు అన్నారు .

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బి ఆర్ఎస్ గెలుపు ఖాయం





(మొదటి పేజీ తరువాయి...)

వెళ్ళాలంటే ప్రజల మద్దతు అవసరం, కానీ కాంగ్రెస్ దాడులు మాత్రమే చేస్తోంది. బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు వంద శాతం ఖాయం" అని ధైర్యంగా ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ, "మోసం చెయ్యడమే కాంగ్రెస్ నిజ స్వరూపం. వంద రోజులలో హామీలు అమలు చేస్తామని చెప్పి ఎటువంటి హామీలు అమలు పరచలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఏ మొహం పెట్టుకొని కాంగ్రెస్ నేతలు ప్రజల వద్ద ఓట్లు అడుగుతారో ప్రజలే ప్రశ్నిస్తున్నారు" అని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీని వీడి పలువురు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. పట్వారీగూడెం పంచాయతీకి చెందిన బుల్లా నాగరాజు, వాడే వసంత్, కొమరం వెంకటేశ్వరరావు, కుర్సం మారప్ప, కాసిని బాలాజీ, బందెల నాగరాజు, గణేష్ పాడు నుంచి ఎర్రగొర్ల సాయి, దురదపాడు నుంచి కుర్సం కవిత రేగ కాంతా రావు, మెచ్చా నాగేశ్వరరావు సమక్షంలో బిఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షులు రావు జోగేశ్వరరావు, వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జున రావు, నియోజ కవర్గ నాయకులు సోయం విర భద్రం, మాజీ జడ్పీటీసీ సున్నం నాగమణి, రైతు సంఘం మండల అధ్యక్షులు అంకత ఉమ మహేశ్వర రావు, దారా యుగుందర్, జలగం వాసు, నాయక పోడు సంఘం నాయకులు రావుల శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షులు గాజు బోయిన ఏసుబాబు, యువజన విభాగం అధ్యక్షులు యార్లగడ్డ శ్రీనివాసరావు, యూత్ అధ్యక్షులు సత్య, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు రావూరి వీరయ్య తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# గాంధీ సిద్ధాంతాలు నేటి యువతకు అవసరం

- గ్రంథ పాలకుడు ఆర్ నాగన్న



**టేకులపల్లి, అక్టోబర్ 3, ప్రజాజ్యోతి:** జాతిపిత మహాత్మాగాంధీ సిద్ధాంతాలు నేటి యువతకు అవసరమని గ్రంథ పాలడు ఆర్. నాగన్న అన్నారు. టేకులపల్లి గ్రంధాలయ కార్యాలయంలో గ్రంథ పాలకుడు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా మహాత్మా గాంధీ జయంతిని నిర్వహించారు. గాంధీజీ చిత్ర పటానికి పూలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భరత జాతిని ఏకతాటిపై నడిపించి బ్రిటీష్ సామ్రాజ్యంపై శాంతి, అహింసలతో పోరాడి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుడు గాంధీజీ అని ఆయన పేర్కొన్నారు. ఆ మహాత్ముడు చూపిన బాట, ఆయన ఆచరించిన విలువలు యువతరానికి ఆదర్శం కావాలన్నారు. అప్పుడే మనం కలలు కంటున్న నవ భారత దేశం సాకారం అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఆత్మాభిమానం, ఆత్మగౌరవం వేరెవరో పరిరక్షించరు. మనకు మనమే వాటిని కాపాడుకోవాలని గాంధీ చెప్పిన మాటలు స్ఫూర్తిదాయకమని ఆయన తెలిపారు. స్వతంత్ర ఉద్యమంలో గ్రంధాలయాలు పాత్ర చాలా అమోఘమైనది. కరపత్రాలు ముద్రించి గ్రంధాలయంలో ఉంచడం పోరాటానికి, ఉద్యమానికి నాంది పలకడం జరిగింది అని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ షాప్ రాధాకృష్ణ, ఏపూరి వెంకన్న, బానోత్ కృష్ణ, వేణు, వాసు, తేజవత్ బాలు, బోడ వీర తదితరులు పాల్గొన్నారు.

# దండు సారయ్య కు యాక్టీవా బహుకరణ



**ఇల్లందు, అక్టోబర్ 3, ప్రజాజ్యోతి:** పట్టణంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ 13వ వార్డుకు చెందిన శివశక్తి దండు సారయ్య (సారిక చౌదరి)కు దసరా పండుగను పుర స్కరించుకొని ఇల్లందు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్ గౌడ్ యాక్టీవా ద్విచక్ర వాహనాన్ని స్థానిక పింగళి హోండా షోరూమ్ లో బహుకరించారు. గత కొన్ని ఏళ్ళ నుంచి శివశక్తి దండు సారయ్యకు ద్విచక్ర వాహనం లేకపోవడం వల్ల దసరా పండుగ రోజున యాక్టీవా బహుకరించడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో శివశక్తి దండు సారయ్య (సారిక చౌదరి ) రాజకీయాల్లో రాణించాలని కోరారు. అదేవిదంగా తనకు దసరా పండుగ రోజున యాక్టీవా ద్విచక్ర వాహనాన్ని బహుకరించిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్ గౌడ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకట్, మేకల నగేష్, రాజేందర్, పింగళి హోండా నిర్వాహకులు పింగళి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీఎం014 గాంధీ చిత్రపటంకు నివాళ్లర్పిస్తున్న దృశ్యం

- ఐటీడీఏలో గాంధీ జయంతి వేడుకలు



**భద్రాచలం, అక్టోబరు 9, ప్రజా జ్యోతి:** భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో గురువారం గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో ఎస్టీసీ రవీంద్రనాథ్ గాంధీ చిత్రపటంకు పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీషు పునాదులు కదిలించేందుకు ఉప్పు సత్యాగ్రహాన్ని ప్రారంభించడంతో ఆంగ్లేయులు దిగిరాక తప్పలేదని, అణిచివేతను ఎదుర్కొనేందుకు సత్యాగ్రహాన్ని ఆయుధంగా రూపొందించారని అన్నారు. గాంధీ ఆశయాలు నేడు ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని వాటిని కిందిస్థాయి ప్రజలకు అందేలా మనందరం పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజరు అది నారాయణ, డీటీఎల్ ఆర్ వెంకటేశ్వరరావు, శ్రీనివాసు, చలపతి, రమణమూర్తి, మోహన్, జోగారావు, వీరయ్య, చంటి, పవన్, గణేష్ పాల్గొన్నారు.

# 7న భద్రాద్రిలో శబరి స్మృతి యాత్ర గిరిజనుల రాక

- దేవస్థానం అధ్వర్యంలో ప్రత్యేక ఆర్టీసీ బస్సుల ఏర్పాటు.
- భారీ సంఖ్యలో గిరిజనులతో భద్రగిరి ప్రదక్షిణ



**భద్రాచలం, అక్టోబరు 3, ప్రజా జ్యోతి:** భద్రాచలంలో ఈ నెల 7న ఆశ్వీయుజ పూర్ణిమ సందర్భంగా గిరిజన ఉత్సవమైన శబరి స్మృతి యాత్రను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం ఏపీలోని చింతూరు, వీఆరపురం, కూనవరం, తెలంగాణలోని అశ్వారావుపేట, చర్ల, దుమ్ముగూడెం మండలాల నుంచి అధిక సంఖ్యలో గిరిజనులను తీసుకొచ్చేందుకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులతో పాటు వారి రాకపోకలను పర్యవేక్షించేందుకు దేవస్థానం తరపున బాధ్యులను దేవస్థానం ఈవో కె.దామోదరరావు నియమిస్తున్నారు. స్మృతియాత్ర రోజున గిరిజన భక్తుల సమక్షంలో వారి చేతుల మీదుగా ఫల, పుష్పాదులతో అర్చనలు, కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. అలాగే 7న ఉదయం శబరి చిత్రపటంతో భద్రగిరి ప్రదిక్షణ, దమ్మక్క విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు, ఆలయంలో స్వామివారికి గిరిజనుల సమక్షంలో కల్యాణం, అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. అలాగే గిరిజనులకు అవసరమైన వసతి, భోజన, అల్పాహార సదుపాయాలను దేవస్థానం ఏర్పాటు చేయనుంది.

## మీకు ఓట్లు వేసింది జీతాలు తగ్గించడానికా

- జీవో నెం.84 రద్దు చేయాలి. టైం స్కేల్ ఇవ్వాలి
- సమ్మెను ఉధృతం చేయాలని జేఏసీ పిలుపు ఐటీడీఏ ఎదుట డైలీవేజ్ వర్కర్ల వంటా వార్పు



**భద్రాచలం, అక్టోబరు 3, ప్రజా జ్యోతి:** మీకు ఓట్లు వేసింది మా జీతాలు తగ్గించడానికా, జీవో నెం. 84ను రద్దు చేసి వెంటనే టైం స్కేలు ఇవ్వాలని హాస్టల్ డైలీ వేజ్ వర్కర్ల యూనియన్ జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం భద్రాచలం ఐటీడీఏ ఎదుట డైలీవేజ్ వర్కర్ల ఆధ్వర్యంలో వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు ఏజే రమేష్, హీరాలాల్, కౌసల్యలు మాట్లాడుతూ డైలీవేజ్ వర్కర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, జీవో నెం.84ను తక్షణమే రద్దు చేయాలని అన్నారు. నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం ఏమిటని, మా ఆకలి మంటలు మీకు అర్థం కావా, మీకు ఓట్లు మా బ్రతుకులు రోడ్లపాలు చేసుకోవాలా అని ప్రశ్నించారు. పోటీ కార్మికులను పెట్టి సమ్మెను విచ్చిన్నం చేయాలని ప్రయత్నం చేస్తే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తక్షణమే ఐటీడీఏ పీవో జోక్యం చేసుకొని సమస్య పరిష్కారంకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డైలీవేజ్ వర్కర్ల యూనియన్ నాయకులు భద్రయ్య, దాసు, పాయం ముత్తయ్య, మంగమ్మ, నాగమణి పాల్గొన్నారు.


## ఐటీడీఏలో వాహనాలకు పూజలు



**భద్రాచలం, అక్టోబరు 3, ప్రజా జ్యోతి:** భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో దసరా పండుగ సందర్భంగా గురువారం వాహనాలకు సంప్రదాయబద్ధంగా డ్రైవర్లందరూ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్ల సంఘం డివిజన్ అధ్యక్షులు రాఘవులు మాట్లాడుతూ ఉద్యోగ ధర్మంగా మనకు కేటాయించిన వాహనాలలో అధికారులను తీసుకొని ప్రతి మారుమూల ప్రాంతంలో పర్యటిస్తూ ఉంటామని ఎటువంటి ప్రమాదాలు గురికాకుండా మనం క్షేమంగా ఉంటూ ఎదుటివారిని ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆదిశక్తి స్వరూపిణి అయిన జగన్మాత మనల్ని కాపాడుతూ ఉంటుందని అన్నారు. దసరా పండుగ రోజు ఆదిశక్తి స్వరూపిణి అయిన దుర్గామాతను పూజించి ఆయుధ పూజ చేయడం జరిగిందన్నారు. ఐటీడీఏలోని డ్రైవర్లు పాల్గొన్నారు.

## ఘనంగా సాయిబాబాపుణ్య తిథి వేడుకలు

- లక్ష రూపాయలు విరాళం



**భద్రాచలం టౌన్, అక్టోబర్ 3, ప్రజా జ్యోతి:** ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్లో ఉన్న శ్రీ సాయి బాబా వారి మందిరంలో గురువారం విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించామని అధ్యక్షులు కొమ్మనాపల్లి ఆదినారాయణ తెలిపారు. సాయిబాబా వారు మహా సమాధి పొందిన రోజు సందర్భంగా విజయదశమి నాడు ఉదయం బాబాకు పాలతో అభిషేకం నిర్వహించి , బాబా వారికి స్వర్ణ ఆభరణాలు అలంకరించి హారతి పాడారు. పుష్పాలతో బాబా సమాధి అలంకరణ ఏర్పాటు చేశారు.అష్టోత్తర నామార్చన జరిపారు. భద్రాచలం వాస్తవ్యులు దుద్దుకూరి శివకేశవరావు, సునీతా దంపతులు విజయదశమి రోజు పూల అలంకరణ కు, అన్న ప్రసాదానికి రూ. 1 లక్ష విరాళంగా అందించారు. దాతలను ఆలయ కమిటీ శాలువాతో ఘనంగా సత్కరించి సాయిబాబా వారి చిత్రపటాన్ని అందజేశారు. మధ్యాహ్నం సుమారు 1400 మంది బాబా అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అబ్బినేని శ్రీనివాసరావు, కోశాధికారి గొర్ల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు కొమ్మనపల్లి వెంకటరమణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఎస్ రావు ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్



**కొత్తగూడెం, అక్టోబర్ 3(ప్రజాజ్యోతి):** కొత్తగూడెం లోని ప్రముఖ ఇ.ఎన్.టి సర్జన్ డాక్టర్ బి.ఎస్ రావు లక్ష్మీదేవిపల్లి మండలం బొజ్జాయిగూడెం గ్రామంలో శుక్రవారం వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ టోర్నమెంట్ 3,4,5 తేదీల పాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఎస్.రావు మాట్లాడుతూ..ఏజెన్సీ గ్రామాలలో ఉన్న యువకులకు స్నేహపూర్వక వాతావరణాన్ని , వాలీబాల్ క్రీడా నైపుణ్యాన్ని, క్రీడలపై ఆసక్తిని పెంపొందించాలని ఉద్దేశంతో ఈ టోర్నమేంట్ ప్రారంభించామన్నారు.ప్రతి ఒక్కరు క్రీడ స్పూర్తిని పెంపొందించుకోవాలని,క్రీడల వల్ల శరీరం దృఢంగా,ఉత్సాహంగా ఉంటుందన్నారు. ఈ టోర్నమెంట్ లో 22 జట్టు పాల్గొంటున్నాయని, ఈ టోర్నమెంట్ నందు గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.10116, రెండో బహుమతి రూ.50116, మూడో బహుమతిగా(వాలీబాల్ నెట్టు, బాల్) అందించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుర్సం రమేష్, పాయం ప్రశాంత్, వజ్జ వెంకటేష్, కుంజ రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ, శాస్త్రి జయంతి వేడుకలు

- చిన్నారులకు పలక బలపాలు పంపిణీ



**భద్రాచలం, అక్టోబర్ 2 ,ప్రజాజ్యోతి :** దేశానికి స్వాతంత్రం సాధించిపెట్టిన మహాత్మా గాంధీ, "జై జవాన్ – జై కిసాన్" నినాదంతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన రెండవ ప్రధానమంత్రి లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా భద్రాచలం పట్టణంలోని సాయిబాబా దేవాలయం సెంటర్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు భూక్యా మాన్ సింగ్ చిన్నారులకు పలకలు, బలపాలు పంపిణీ చేసారు అనంతరం అయన మాట్లాడుతూ గాంధీజీ, లాల్ బహుదూర్ శాస్త్రిజీ చూపిన త్యాగమే ఈరోజు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛకు మూలం. మహాత్ములు చూపిన సత్యం, అహింస, నిజాయితీ, సేవామార్గాలను మనం అనుసరించాలి. చిన్నారులే రేపటి భావితరపు పౌరులు. వారి చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని పేర్కొన్నారు.గాంధీజీ తన అహింసా సిద్ధాంతంతో ప్రపంచాన్నే ప్రభావితం చేశారు. శాస్త్రిజీ దేశంలో ఆహార భద్రత కోసం రైతులకు, దేశ రక్షణ కోసం సైనికులకు బలాన్ని ఇచ్చారు. ఇద్దరు మహానేతల జ్ఞాపకం ప్రతీ భారతీయుడికి శక్తినిస్తూనే ఉంటుందని అన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు కూడా గాంధీ, శాస్త్రి ల త్యాగాలు, సత్యనిష్టను గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు మహానేతల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశభక్తి గీతాలు పాడి దేశ స్వాతంత్ర సమర యోధుల త్యాగాలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో పి. చెన్నరావు, శ్రీనివాసరావు, జగన్ మోహన్ రావు, ఆంజనేయ శాస్త్రి, వెంకట్ నారాయణ, అంగన్వాడీ టీచర్ సావిత్రి, జయంతి, ఆనంద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి నదిలో ప్రారంభమైన అమ్మ వారి విగ్రహాల నిమజ్జనం

- ఆలస్యంగా ప్రారంభించడం పట్ల భక్తమండళ్ల ఆగ్రహం
- పెద్ద విగ్రహాలను ఎక్కించేందుకు అందుబాటులో లేని క్రేన్
- విగ్రహాల నిమజ్జనంకు సరైన ఏర్పాట్లు చేయలేదని భక్తమండళ్ల ఆగ్రహం



**భద్రాచలం, అక్టోబరు 3, ప్రజా జ్యోతి:** భద్రాచలంలోని పవిత్ర గోదావరి నది వద్ద శుక్రవారం నుంచి నవరాత్రులు పూజలందుకున్న అమ్మవార్ల విగ్రహాల నిమజ్జనం ప్రారంభమైంది. అమ్మవార్లను ఉదయం నుంచే భక్తమండళ్లు తీసుకొని రాగా ఉదయం సమయంలో నిమజ్జనఘాట్ వద్ద అధికారులెవరూ లేరు. దీంతో భక్తమండళ్లు స్థానిక అధికారులకు సమాచారం ఇచ్చినా వారు సైతం అంతా స్పందించలేదు. దీంతో సామాజిక మాధ్యమాల్లో ఈ విషయంపై ప్రచారం కావడంతో మధ్యాహ్నం సమయానికి నీటిపారుదల, గ్రామ పంచాయతీ గజ ఈతగాళ్లు నిమజ్జన స్థలంకు చేరుకొని విగ్రహాలను లాంచీల్లోకి ఎక్కించారు. అధికారులందరూ దసరా పండుగ నుంచి ఇంకా తేరుకోలేదా అని భక్తులు ప్రశ్నించడంతో అధికారులు ఖంగుతిన్నారు. ఇదిలా ఉండగా సుమారు 20 పెద్ద విగ్రహాలను లాంచీపై ఎక్కించేందుకు క్రేన్ కావాల్సి ఉండగా అందుబాటులో లేకపోవడంతో వాటిని అలానే ఒడ్డున ఉంచారు. ప్రస్తుతంకు చిన్న విగ్రహాలను లాంచీలపైకి ఎక్కించి తీసుకెళుతున్నారు. అధికారులతో మాట్లాడి సాయంత్రం లేక రేపు ఉదయంకు క్రేన్ తీసుకొచ్చి పెద్ద విగ్రహాలను లాంచీలపైకి ఎక్కించనున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి అమ్మవార్ల విగ్రహాలను ఇక్కడ నిమజ్జనం చేసేందుకు తీసుకొస్తున్నారు. శుక్రవారం ఖమ్మం, మహబూబాద్, ఇల్లందు, చర్ల, భద్రాచలం ప్రాంతాలకు చెందిన విగ్రహాలను తీసుకొచ్చారు. శని, ఆదివారాలు సైతం నిమజ్జనం కొనసాగనుంది. అందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చిన అమ్మవారి విగ్రహాలను లాంచీలోకి క్రేన్ సాయంతో ఎక్కించి గోదావరి మధ్యలో నిమజ్జనం చేస్తున్నారు.

# లీగల్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే





**టేకులపల్లి, అక్టోబర్03, ప్రజాజ్యోతి:** గిరిజన, పేద ప్రజలకు సకాలంలో న్యాయం జరిగేలా అడ్వకేట్లు కృషి చేయాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. టేకులపల్లి సెంటర్ లోని గుడిపూడి మోహన్‌రావు కాంప్లెక్స్‌లో సీనియర్ న్యాయవాది తోటకూరి శ్రీనివాసరావు లీగల్ కార్యాలయాన్ని గురువారం ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నిరుపేదల పక్షాన నిలబడి వారికి న్యాయం సలహాలు ఇంచే విధంగా అందుబాటులో ఉండాలని ఆయన పేర్కొన్నారు.లోక్ అదాలత్ తేదీలను బాధితులకు తెలిపి పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో కోరం లక్ష్మి , కోరం సురేందర్, కోరం ఉమా,లక్కినేని సురేందర్ రావు, దళపతి శ్రీనివాస్ రాజు, గుడిపూడి మోహన్ రావు, గుడిపూడి సత్యనారాయణ, ఇది గణేష్, ఇస్లావత్ రెడ్యానాయక్, గజ్జల రామ్ శేఖర్, తోటకూరి ఉపేందర్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటి గృహప్రవేశంలో పాల్గొన్న కొత్వాల శ్రీనివాసరావు



**పాల్వంచ (రూరల్ ),అక్టోబర్ 03,ప్రజా జ్యోతి:** కల్లూరు మండలం నారాయణపురంలో రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నూతన గృహ ప్రవేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొని మంత్రి పొంగులేటికి శుభాకాంక్షలు తెలిపారు.దసరా శుభాకాంక్షలు కూడా అందించారు.ఈ సందర్భంగా ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి, తుంబూరు దయాకర్ రెడ్డి తదితరులను కొత్వాల శ్రీనివాసరావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జాలే జానకి రెడ్డి, పాల్వంచ మాజీ జడ్పిటిసి ఎర్రంశెట్టి ముత్తయ్య,పాల్వంచ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న, కాంగ్రెస్ నాయకులు ఎస్.వి.ఆర్.కె. ఆచార్యులు,ఉండేటి శాంతివర్ధన్ పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్ లోకి చేరికలు

- కాంగ్రెస్ కండువా కప్పుకున్న పిఎసిఎస్ చైర్మన్ లక్కినేని



**టేకులపల్లి,అక్టోబర్ 03, ప్రజాజ్యోతి :** టేకులపల్లి పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ లక్కినేని సురేంద్రరావు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.గురువారం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో మంత్రి స్వగృహంలో బేతంపూడి పీఏసీఎస్ చైర్మన్ లక్కినేని సురేంద్రరావు, భారాత రాష్ట్ర సమితి యువజన నాయకులు బానోత్ వాలు నాయక్, బాణోత్ రాజా తదితరులు కాంగ్రెస్ పార్టీలో మంత్రి పొంగులేటి వారికి కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా పెద్దమ్మగుడిలో సత్యనారాయణ వ్రతం

- ఘనంగా అన్నదాన కార్యక్రమం.





**పాల్వంచ(రూరల్ ),అక్టోబర్ 03,ప్రజా జ్యోతి:** మండలం కేశవాపురం–జగన్నాధపురం గ్రామంలో వెలసి ఉన్న శ్రీ కనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మగుడి )లో దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసిన అనంతరం శుక్రవారం సామూహిక శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామివ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.దేవస్థాన అర్చకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వ్రతంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.అనంతరం భక్తులు శ్రీ సూర్యదేవర రజనీకాంత్–నిహారిక,బాదర్ల బాపూజీ–కృష్ణవేణి, శ్రీ దుర్గా జిరాక్స్, శ్రీ హైటెక్ థర్మల్ కన్స్ట్రక్షన్స్ సహకారంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.శుక్రవారం సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకం ఘనంగా నిర్వహించారు.ముందుగా మేళతాళాలతో జన్మస్థలంలో అమ్మవారికి పసుపు,కుంకుమ,గాజులు సమర్పించి హారతులు చేశారు.అనంతరం దేవాలయంలో మూలవిరాటికి పంచామృతాలతో అభిషేకం చేసి పంచహారతులు,నివేదన,నీరాజన మంత్రపుష్పం వంటివి నిర్వహించారు.ఈ సందర్భంగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్. రజనీకుమారి,దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు,సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.దేవస్థాన పాలకమండలి ప్రకటనలో,భక్తుల సహకారంతో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు విజయవంతంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు.

## దసరా ఉత్సవాలలో బంజారుల బోనాలు





**టేకులపల్లి,అక్టోబర్03,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని తూర్పు సేవాలాల్ గుడి వద్ద బంజారుల ఆధ్వర్యంలో గురువారం పల్లకి సేవ, బోనాలు,శోభయాత్ర, మహా బోగ్ బండార్,దసరా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ మేరామా యాడి బోనాల జాతర అనేది ప్రధానంగా బంజారా (లంబాడీ) సమాజానికి వర్గానికి చెందిన ఒక ముఖ్యమైన ఉత్సవం దీని విశిష్టత సంత్ సేవాలాల్ మహారాజ్ కు జాతర సంబంధించినది.ఈయన బంజారా సమాజానికి ఆరాధ్య దైవం, ధార్మిక, సామాజిక సంస్కర్త,బంజారా సంస్కృతి, భాష, విలువలను కాపాడటంలో ఆయన బోధనలు కీలకం,బోనాల పండుగలు గ్రామ దేవతలను, శక్తి స్వరూపిణి అయిన దేవతను ఆరాధించడం ద్వారా గ్రామానికి, ప్రజలకు సౌభాగ్యం,ఆరోగ్యం, వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఈ సందర్భంగా ఆరాధిస్తారు.ఈ జాతర కూడా అటువంటి శ్రేయస్సును ఆకాంక్షిస్తూ బంజారాలు ఈ బోనాల కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా బంజారా మహిళలతో,నృత్యాలతో, డిజె సాంగులతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బంజారా నాయకులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దసరా ఉత్సవాలు





**టేకులపల్లి,అక్టోబర్03,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని పలు గ్రామాలలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.బోడు,టేకులపల్లి బ్రహ్మంగారి వీధి, బస్టాండ్ సెంటర్, తెలుగురు గ్రామాలలో కనకదుర్గమ్మ శోభయాత్ర ఘనంగా నిర్వహించారు.శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారినిదర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.క్షమీ వృక్షం దగ్గరికి వెళ్లి ప్రత్యేకమైన పూజలు నిర్వహించారు. భక్తులు వారి కోరికలు కోరి వృక్షానికి ముడుపులు కట్టారు. ఆనందోత్సవాల మధ్య టపాసుల మోతతో ఊరేగింపుగా,బ్యాండ్ మేళాల తో, యువతీ యువకుల నృత్యాలతో డిజె సాంగ్ లతో శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు.

## అన్ని అనుమతులతోనే హెచ్ కన్వెన్షన్ హాల్ నిర్మాణం

- కన్వెన్షన్ హాల్ పై తప్పుడు ప్రచారం తగదు
- ఫైర్ సేఫ్టీ_ మున్సిపల్ పర్మిషన్ అన్ని అనుమతులతోనే నిర్మాణం చేసామ
- తప్పడు ప్రచారం చేసే వారిపై చర్యలు తప్పనిసరి
- విలేకరుల సమావేశంలో కన్వెన్షన్ హాల్ యజమాని నల్లా సురేష్ రెడ్డి



**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 3, ప్రజా జ్యోతి:** పాల వ్వంచ మండల పరిధిలోని జగన్నాధ పురం గ్రామపంచాయతీ సమీపంలో నిర్మాణం చేసిన హెచ్ కన్వెన్షన్ హాల్ కు అన్ని అనుమతులు ఉన్నాయని, అయినప్పటికీ కొంతమంది పాత్రికేయులు కావాలనే తమ కన్వెన్షన్ హాల్ పై తప్పుడు ప్రచారం చేస్తూ బ్లాక్ మెయిలింగ్ కు పాల్పడుతున్నారని కన్వెన్షన్ హాల్ యజమాని శ్యామల ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ నల్ల సురేష్ రెడ్డి తెలిపారు, శుక్రవారం పాల్వంచ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సురేష్ రెడ్డి మాట్లాడుతూ తాను నిర్మాణం చేసిన హెచ్ కన్వెన్షన్ హాల్ స్థలంలో 2014లో బ్రిక్స్ ఫ్యాక్టరీ కోసం తీసుకోవడం జరిగిందని, 2016లో ఆ స్థలాన్ని భాస్కర్ రెడ్డి అనే వ్యక్తి నుండి తీసుకొని రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు, 1954 నుండి అట్టి స్థలానికి అన్ని అనుమతులు ఉన్నాయన్నారు, భాస్కర్ రెడ్డి వద్ద నుండి తీసుకున్నప్పుడు రెండు ఎకరాలు పైనే ఉండగా మరికొంత భూమిని తీసుకోవడం జరిగిందని, ఆ భూమిలో మొదటిగా బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేద్దామని అనుకున్న తరుణంలో రెస్టారెంట్ కు పర్మిషన్ లేకపోవడంతో 2021లో హెచ్ కన్వెన్షన్ హాల్ నిర్మాణం ప్రారంభించామన్నారు, కన్వెన్షన్ హాల్ ప్రారంభానికి ముందుగానే తాసిల్దార్ కార్యాలయం నుండి నుండి నాలా కన్వెన్షన్ పర్మిషన్ తీసుకున్న మున్సిపల్ పర్మిషన్ కూడా తీసుకోవడం జరిగిందన్నారు, కన్వెన్షన్ హాల్ కు సంబంధించి అన్ని రెవెన్యూ రికార్డులు పరంగా తమ వద్ద ఆధారాలతో ఉన్నాయన్నారు, 2020 నుంచి కన్వెన్షన్ హాలుకు పన్ను కూడా చెల్లిస్తున్నామన్నారు, కన్వెన్షన్ హాలకు ఫైర్ సేఫ్టీ ఉన్నప్పటికీ ఇటీవల కొన్ని పత్రికలలో తమ కన్వెన్షన్ హాల్ కు ఫైర్ సేఫ్టీ లేదని, భద్రత కరువైందని రాయడం ఎంతవరకు సమంజస్మని సురేష్ రెడ్డి ప్రశ్నించారు, హెచ్ కన్వెన్షన్ హాల్ పై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పాటు వివిధ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

## దసరాను పురస్కరించుకొని మహా అన్నదానం





**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 3 ,ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని నూతనంగా నిర్మించిన శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన దుర్గామాత మండపం వద్ద దసరా పండగను పురస్కరించుకొని దేవీ నవరాత్రుల సందర్భంగా శుక్రవారం ఉదయం మహా అన్నదానం నిర్వహించారు. కమిటీ సభ్యులు, ఊరుపెద్దలు, దాతల సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ అన్నదానానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కమిటీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.సుమారు వెయ్యి మంది భక్తులు భక్తిశ్రద్ధలతో అన్నదానంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించగా, మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తి శ్రద్ధలతో వచ్చిన మహిళా భక్తులకు కుంకుమార్చన చేసి, అమ్మవారి కుంకుమ పొట్లాలను అందజేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల రాకపోకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొని పండుగ వాతావరణాన్ని మరింత వైభవంగా మార్చారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ — "ప్రతి ఏటా దసరా పండగ సందర్భంగా ఈ అన్నదానాన్ని కొనసాగించే ప్రయత్నం చేస్తాం" అని తెలిపారు.

## స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చు పరిమితులు ప్రకటించిన ఈసీ

- ఖర్చు పరిమితి మించితే అనర్హత – ఎన్నికల సంఘం హెచ్చరిక.
- సర్పంచ్,ఎంపీటీసీ,జడ్పీటీసీ అభ్యర్థుల ఖర్చుపై ఈసీ కఠిన నిబంధనలు.
- 45 రోజుల్లోపు ఖర్చు వివరాలు సమర్పించాలి –ఎన్నికల నియమాలు.
- స్థానిక ఎన్నికల్లో గెలిచినా.ఖర్చు వివరాలు ఇవ్వకపోతే పదవి రద్దు
- పార్టీ ఖర్చులు కూడా అభ్యర్థి ఖాతాలోనే –ఈసీ స్పష్టం
- గ్రామ పంచాయతీ నుంచి జడ్పీటీసీ వరకు ఖర్చు పరిమితులు ఖరారు






**పాల్వంచ (రూరల్),అక్టోబర్ 03,ప్రజా జ్యోతి:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఇప్పటికే విడుదలైన విషయం తెలిసిందే. అక్టోబర్ 9 నుంచి నామినేషన్లు ప్రారంభంకానున్నాయి.ఈ క్రమంలో అభ్యర్థులు ఖర్చు చేయగల పరిమితిని ఎన్నికల సంఘం స్పష్టంగా తెలిపింది.ఎన్నికల ఖర్చు పరిమితిని మించి ఖర్చు చేసినా, లేదా ఫలితాలు వెలువడిన 45 రోజుల్లోపు ఖర్చుల వివరాలను సమర్పించకపోయినా ఈసీ కఠిన చర్యలు తీసుకోనుంది. నిబంధనలు ఉల్లంఘించిన అభ్యర్థులు మూడేళ్లపాటు పంచాయతీ రాజ్ ఎన్నికల్లో పోటీ చేయలేరు.గెలిచినా పదవిని కోల్పోయే అవకాశముందని అధికారులు హెచ్చరించారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం–2018లోని సెక్షన్ 238 ప్రకారం ఈ నియమాలు అమల్లోకి వస్తాయి.

**ఖర్చు పరిమితులు:** గ్రామ పంచాయతీలు (జనాభా 5000 పైగా): సర్పంచ్ అభ్యర్థి రూ.2.50 లక్షలు, వార్డు సభ్యుడు రూ.50 వేల లోపు.గ్రామ పంచాయతీలు (జనాభా 5000 లోపు): సర్పంచ్ అభ్యర్థి రూ.1.50 లక్షలు, వార్డు సభ్యుడు రూ.30 వేల లోపు.జడ్పీటీసీ అభ్యర్థి: రూ.4 లక్షలు.ఎంపీటీసీ అభ్యర్థి: రూ.1.50 లక్షలు.రాజకీయ పార్టీలు చేసే ఖర్చు కూడా అభ్యర్థి ఖాతాల్లోనే జమ అవుతుందని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.అయితే పార్టీ తరఫున సామాన్య ప్రచారానికి అయ్యే ఖర్చులను మాత్రం అభ్యర్థి వ్యక్తిగత ఖాతాల్లో చూపాల్సిన అవసరం లేదని పేర్కొంది.ఫలితాలు వెల్లడైన తేదీ నుంచి 45 రోజుల్లోపు వ్యయ తుది నివేదికను సమర్పించాలి.వార్డు,సర్పంచ్, ఎంపీటీసీ అభ్యర్థులు ఎంపీడీఓకు, జడ్పీటీసీ అభ్యర్థులు జడ్పీ సీఈఓకు ఖర్చు వివరాలను అందజేయాలి.

# సంప్రదాయబద్ధంగా శమీపూజ













- భద్రాద్రి రామయ్యకు మహా పట్టాభిషేకం
- ఆకట్టుకున్న శ్రీరామ లీలా మహోత్సవం
- బాణం సంధించిన దేవస్థానం ఈవో దామోదర్రావు



**భద్రాచలం, అక్టోబరు 3, ప్రజా జ్యోతి:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అధ్వర్యంలో గురువారం విజయదశమి సందర్భంగా శమీపూజ వైభవోపేతంగా నిర్వహించారు. ముందుగా శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని మేళతాళాలు, బాజబజంత్రీల నడుమ దసరా మండపం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం శమీపూజను భక్తిప్రపత్తులతో సంప్రదాయద్ధంగా నిర్వహించారు. తొలుత విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, సంప్రోక్షణ నిర్వహించి షోడపోచారంతో శమీ వృక్షానికి పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం సుదర్శనం, ఖడ్గం, ధనస్సు, గద తదితర ఆయుధాలకు అర్చకులు పూజలు చేసి ఉద్వాసన పలికారు. చివరగా ఇంద్రుడు, యముడు, వరుణుడు, కుబేరునకు ఆవాహన చేసి బాణాలు సంధించారు. ఈ సమయంలో జమ్మి పత్రాలు, అక్షింతలతో అర్చన చేసి చివరగా వాటిని భక్తుల శిరస్సుపై చల్లారు. అనంతరం శ్రీరామ లీలా మహోత్సవాన్ని నిర్వహించగా వందలాది మంది భక్తులు తిలకించారు. ఈ సమయంలో రవాణాసుర బొమ్మపై బాణాన్ని దేవస్థానం ఈవో దామోదర్రావు సంధించారు. చివరగా స్వామి వారికి తిరువీధి సేవ నిర్వహిస్తూ రామాలయంకు తీసుకెళ్లారు. అంతకు ముందు ఉదయం ఆలయంలో శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, అష్టోత్తరం, సహస్రనామార్చన నిర్వహించారు. తరువాత చిత్రకూట మండపంలో శ్రీ సీతారామచంద్రస్వామికి నిత్యకల్యాణం నిర్వహించగా, శ్రీరామాయణ పారాయణ సమాప్తిని పురస్కరించుకొని శ్రీరామ మహాపట్టాభిషేకాన్ని నిర్వహించారు. ఈ సమయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహావచనం, కలశస్థాపన, పట్టాభిషేకఘట్ట పారాయణం, కిరీటధారణ, కలశ జలాలతో స్వామి వారికి ప్రోక్షణ, వేద ఆశీర్వచనం, మంగళహారతి నిర్వహించారు. ఈ కార్యక్రమాలోదేవస్థానం ఈవో కె.దామోదర్రావు, ఏఈవో శ్రావణకుమార్, పట్టణ సీఐ నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, వైదిక సిబ్బంది పాల్గొన్నారు.

## పాల్వంచలో మహాత్మా గాంధీ,లాల్ బహదూర్ శాస్త్రిలకు ఘన నివాళులు



**పాల్వంచ(రూరల్),అక్టోబర్ 03,ప్రజా జ్యోతి:** పాల్వంచ పట్టణంలో జాతిపిత మహాత్మా గాంధీ,దేశ మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతుల సందర్భంగా గురువారం ఘన నివాళులర్పించారు.స్థానిక మార్కెట్ లోని విగ్రహాలకు పూలమాలలు సమర్పించి పలువురు ప్రముఖులు,సంఘ ప్రతినిధులు వారి సేవలను స్మరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్,డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ – "గాంధీజీ అనుసరించిన అహింస మార్గమే మనందరికీ శ్రీరామ రక్ష.ఆయన చూపిన మార్గం జాతి ఐక్యతకు, సమాజ శ్రేయస్సుకు దోహదపడుతోంది.అందరూ ఆ మహనీయుని ప్రబోధాలను పాటించాలి" అన్నారు.అలాగే మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి ఇచ్చిన "జై జవాన్ – జై కిసాన్" నినాదం దేశానికి సంస్కరణలు తెచ్చిందని,ఆయన బోధనలు మనందరికీ మార్గదర్శకంగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జాలే జానకి రెడ్డి, ఎస్ .వి.రామానుజాచార్యులు (బ్యాంక్ ఆచార్యులు),నల్లమల్ల వేణు,సముద్రాల వెంకటేశ్వర్లు, ఎర్రం శెట్టి ముత్తయ్య,కొండం వెంకన్న,ఎస్ .వి.ఆర్ .కె. ఆచార్యులు,కోట వెంకటరమణ, లింగ రమేష్,శనగ రామచందర్, బండి అంజయ్య,సునీల్ అగర్వాల్, పరమేశ్వరి వేణు,కొప్పరపు నగేష్, పండ్లకొట్టు శివ,హమాలీ సంఘం అధ్యక్షులు మీసా లింగయ్య,వర్తక సంఘం ప్రముఖులు,రిక్షా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.